క్లుప్తంగా

అంజన్నకు విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని తేరుబజారు మైదానంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హరికృప సేవా భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం వైశాఖ మాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని అర్చకులు వీరేష్ స్వామి నేతృత్వంలో స్వామి వారికి అభిషేకాలు, ఫల, పుష్పాలు సమర్పించి, మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. తేరుబజారు మైదానంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

25న యాదవ ప్రతిభా పురస్కారాలు

ఆదోని టౌన్: ఈనెల 25న జిల్లాలోని యాదవ ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు యాదవ చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కంది వరుణ్‌కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మల్లికార్జున, జిల్లాధ్యక్షుడు ఉసేనప్పయాదవ్ తెలిపారు. ఈనెల 25న కర్నూలులోని ముత్తుకూరుగౌడప్ప యాదవ్, గోశాయి వెంకన్నయాదవ్ ప్రాంగణంలో 10, ఇంటర్‌లలో ప్రతిభ సాధించిన యాదవ విద్యార్థులకు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు పదో తరగతిలో 450, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 800 మార్కులకు పైగా సాధించిన యాదవ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు (హుసేనప్పయాదవ్) 7032289994, 9573376675 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

19న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు, ఈ మేరకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. ఇదిలా ఉండగా 41వ వార్డు కౌన్సిలర్ బోయ లోకేశ్వరి ఎన్నికల బరిలో నిలిచారు.


ఎస్జీటీలను హెచ్‌ఎంలుగా నియమించాలి

ఆదోని సెంట్రల్: ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా సీనియర్ ఎస్జీటీలను నియమించాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సి.సుంకన్న, మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈనెలలో పదోన్నతులు, బదిలీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో హేతుబద్ధీకరణలో మిగిలిపోతున్న స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా నియమించాలనుకోవడాన్ని ఎస్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు రామాంజనేయులు,చింతకుంట రామకృష్ణ, షేక్షావలి,గణేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆదోనికి చేరిన పాఠ్య పుస్తకాలు

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గానికి పాఠ్య పుస్తకాలు సోమవారం వచ్చాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు మొదటి విడత కింద పాఠ్య పుస్తకాలు 85,070, నోటు పుస్తకాలు 1,76,998 వచ్చాయి. పుస్తకాలను స్థానిక నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో నిల్వ చేశారు.

ఖాదర్‌లింగస్వామి సన్నిధిలో ఉరుకుంద డిప్యూటీ కమిషనర్



ఫాతెహాలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్

కౌతాళం: ఖాదర్‌లింగస్వామి 321ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయరాజు స్వామిని దర్శించుకున్నారు. దర్శనానికి వచ్చిన కమిషనర్‌ను దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిస్తీ స్వాగతం పలికి దర్గాలో ప్రత్యేక పాతెహాలు చేపట్టారు. అనంతరం శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. వారి వెంట ఆలయ పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు, సిబ్బంది కుమార్, విజయ్, గుల్షన్ కమిటి అధ్యక్షుడు మున్నపాషా తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి కృషి చేయాలి

ఆదోని రూరల్: మండలంలోని సాదాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న పార్కుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కాలనీవాసులు నరసింహా, సామేల్, లోక్యానాయక్ తదితరులు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను కోరారు. సోమవారం ఎంపీడీఓకు వారు వినతి పత్రం అందించి మాట్లాడారు. పార్కులో ప్రస్తుతం ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగి పోయాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: గుడేకల్ శ్రీరామ్ నగర్‌కు చెందిన రామన్న(65) సోమవారం బైక్‌పై ఎమ్మిగనూరు నుంచి శ్రీరామ్ నగర్‌కు వెళ్తుండగా గుడేకల్ సమీపంలో ప్రమాదశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

- విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం పేదలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఒకటి, మూడు కిలోమీటర్ల నిబంధనతో ఇక్కట్లు
- ఉచిత సీట్లు పొందలేక పోతున్న గ్రామీణ విద్యార్థులు
- దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 19న అఖరు తేదీ

పల్లెకు 'దూరం' ఉచిత ప్రైవేటు విద్య!



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

ఆదోని సెంట్రల్: విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం పేద బలహీన వర్గాలకు చెందిన పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి. అయితే పాఠశాల విద్యార్థి నివాసం నుంచి ఒకటి లేదా మూడు కిలోమీటర్ల లోపు ఉండాలనే నిబంధన గ్రామీణ విద్యార్థులకు శాపంగా మారింది. పట్టణాల్లోనే ప్రైవేట్ పాఠశాలలు ఉండడంతో ద్వారా ఆ పరిసర ప్రాంతాలకు చెందిన వారే ఉచిత సీట్లు పొందే అవకాశం ఉంది. దీంతో గ్రామీణ విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లను పొందలేక పోతున్నారు.

పేదలకు 25 శాతం ఉచిత సీట్లు

పేద విద్యార్థులు ఉచిత సీట్లు పొందేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్లో దరఖాస్తుల ప్రక్రియ కూడా ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కాగా ఈనెల 19వ తేదీ వరకు అవకాశం కల్పించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 2009 జూలై 2వ తేదీన కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అములులోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రతి కూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన నిరు పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. డ్రాపవుట్లు లేకుండా లేకుండా చర్యలు చేపట్టడమే కాకుండా, పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థుల నుంచి అడ్మిషన్లకు, డొనేషన్లు, ఎలాంటి ఫీజులు వసులు చేయకూడదు వంటి నిబంధనలు కూడా ఉన్నాయి.

శాపంగా మారిన నిబంధనలు

ఉచిత సీట్లు కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలు గ్రామీణ పేద విద్యార్థులకు శాపంగా మారాయి. విద్యార్థి నివాసం నుంచి ఒక కిలో మీటరు పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో సీట్లు పొందేందుకు మొదటగా అవకాశం కల్పిస్తారు. ప్రతి కూల పరిస్థితులను బట్టి 3 కిలో మీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. అంటే ఒక కిలో మీటరు పరిధిలోని విద్యార్థుల సీట్లు కేటాయింపులో మిగిలి ఉంటే 3 కిలో మీటరు పరిధిలో ఉన్న విద్యార్థికి కేటాయించేందుకు అవకాశం ఉంది. ప్రైవేట్ పాఠశాలలు ఉండేది పట్టణాల్లోనే కనుక పట్టణ పరిసర ప్రాంతాలు వారికే ఉచిత సీట్లు దక్కుతాయి. అయితే గ్రామీణ పేద విద్యార్థులకు దక్కే అవకాశం లేదు. ప్రభుత్వం స్పందించి ఉచిత సీట్లు కేటాయింపులో పెట్టిన నిబంధనలను సడలించి గ్రామీణ విద్యార్థులకు కూడా సీట్లు పొందే విధంగా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కాగా అమలు

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో గతంలో అనేక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2009 విద్యాహక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు గత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. దీంతో అనేక మంది పేద విద్యార్థులు సీట్లను పొందారు. అధికారం చేపట్టిన తర్వాత రెండేళ్లు కరోనా ప్రభావంతో విద్యారంగానికి ఆటంకం కలిగినా 2022–23 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లను కేటాయించి పక్కాగా అమలు చేశారు. 2023–24 విద్యా సంవత్సరములో 537 మంది విద్యార్థులు, 2024–25 విద్యాసంవత్సరంలో 547 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ఇలా ప్రైవేట్ పాఠశాలల్లో సీట్లను పొందడంతో తల్లిదండ్రులకు ఫీజులు భారం తగ్గింది.

నిబంధనలను సడలించాలి



ఉచిత సీట్లు కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలను సడలించాలి. విద్యార్థి నివాసం నుంచి ఒక కిలో మీటరు, మూడు కిలో మీటర్లు పరిధి విధించడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు సీట్లు పొందే అవకాశం లేదు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొని సీట్లను కేటాయిస్తే బాగుంటుంది. దీంతో గ్రామీణ విద్యార్థులు ఉచిత సీట్లు పొందే అవకాశం కలుగుతుంది. పక్కగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలి.

– శ్రీనివాసులు ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా ఉపాధ్యక్షుడు

సద్వినియోగం చేసుకోవాలి



విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయింపునకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. పేద విద్యార్థులకు ఇది మంచి అవకాశం. 2వ తేదీ నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల అఖరి తేదీ ఈ నెల 19. మీ సేవా కానీ ఆన్‌లైన్ సెంటర్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకొనవచ్చును. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు మండల విద్యాధికారి–2 ఆదోని

ఘనంగా అన్నమయ్య జయంతి

పెద్దకడబూరు : మండలంలో అన్నమయ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు రామమూర్తి ఆధ్వర్యంలో, హెచ్.మురవణి గ్రామంలో సీతారామాంజినేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాలను సోమవారం వేడుకగా జరుపుకున్నారు. ముందుగా అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆయన రచించిన సంకీర్తనలను భజన బృందం ఆలపించారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల పెద్దలు శివరామిరెడ్డి, తెలుగు మధు, మందుల వీరేష్, సత్యారెడ్డి, నాగేంద్ర, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



దొడ్డిమేకల ఆంజనేయస్వామి ఆలయంలో కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం లక్ష్యమని, కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్‌ఎస్ నిర్వహించి.. డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, డీఎల్‌డీఓ రమణారెడ్డి, డీఏల్‌పీఓ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నేడు సద్గురు అల్లీపీరాస్వామి ఉరుసు



అల్లీపీరాస్వాముల సమాదుల వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరాస్వాముల ఉరుసు మహోత్సవం మంగళవారం ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా సోమవారం పీఠాధిపతి, దర్గా ట్రస్ట్ ప్రెసిడెంట్ గురు గాజిహుసేన్‌పీరా స్వాములు మాట్లాడుతూ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధం, రాత్రి స్వామి ప్రభోదనలు ఉంటాయని చెప్పారు. మహోత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు దర్గా అవరణలో చలువ పందిళ్లు, కుళాయిలు, వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ ఉరుసు మహోత్సవంలో పాల్గొని స్వాముల వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

- మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా



రాజు (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఎంజీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న రాజు(35) కర్నూలు ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పది రోజుల క్రితం పెట్రోల్ బంక్‌లో విధులు నిర్వహిస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. కోలుకోలేక ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం రాజు మృతదేహంతో కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంక్ దగ్గర ధర్నా నిర్వహించారు. పదేళ్లుగా పెట్రోల్ బంక్‌లో పనిచేసే వ్యక్తి డ్యూటీలో ఉంటూ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నా యాజమాన్యం స్పందించకపోవటం బాధకరమన్నారు. యాజమాన్య పని ఒత్తిడితోనే బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని వారు ఆరోపించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారని, ఆ కుటుంబాన్ని అదుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం వరకు మృతదేహంతో అదోళన చేశారు. యాజమాన్యం తరుపున ఓ వ్యక్తి వచ్చి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అందోళన విరమించారు.



రాజు మృతదేహంతో పెట్రోల్ బంక్ దగ్గర ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ఆదోని టౌన్: పట్టణ ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా మున్సిపాలిటీ చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్‌గౌస్ అన్నారు. సోమవారం సాయంత్రం వాటర్ పంప్‌హౌస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పంపు హౌస్ సిబ్బందితో మాట్లాడారు. కొంతమంది వ్యక్తులు అక్రమంగా పంపుహౌస్ నుంచి వాటర్ ట్యాంకుల్లోకి నీటిని వదిలే చర్యలు చేపడుతున్నారని తెలిసిందని, అలాంటి చర్యలను సహించమన్నారు.



వాటర్ పంప్‌హౌస్ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహమ్మద్‌గౌస్

శ్రీ మఠంలో కన్నడ సినీ నటుడు



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులు తీసుకుంటున్న సినీ నటుడు ఉపేంద్ర, కుటుంబసభ్యులు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించిన పట్టాభిషేక మహోత్సవానికి కన్నడ సినీ హీరో ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఆదివారం రాత్రి నుంచి ఇక్కడే ఉండి పట్టాభిషేక ఉత్సవాలు తిలకించారు.

వీర జవాన్‌కు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఆదోని రూరల్: ఇటీవల భారత్–పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన అగ్నివీర్ ఎం.మురళీనాయక్‌కు పెద్దతుంబళం గ్రామస్తులు, యువకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సోమవారం రాత్రి మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో అమరవీరుడు మురళీనాయక్ జోహార్ జోహార్ అంటూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ఆర్వో ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా నీటి దోపిడీ చేస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వెంకటేష్, నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సుమారు 8 వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయని, వాటికి ఎలాంటి అనుమతులు లేవన్నారు.

కొనసాగిన పాదయాత్ర

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్లు ఎస్ ఎస్ ట్యాంకు, నెమలికల్ స్కీం ద్వారా గ్రామాలకు రోజు మార్చి రోజు తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర రెండోరోజు సోమవారం కొత్తూరు గ్రామం నుంచి ప్రారంభమై ఆరేకల్ గ్రామంలో ముగిసింది. సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శివర్గ సభ్యులు వీరారెడ్డి, ఉచ్చీరప్ప మాట్లాడుతూ నెమలికల్ స్కీం నుంచి 16 గ్రామాలకు నీరు సరఫరా కావాల్సి ఉండగా కాలం చెల్లిన పైపులైన్ల ద్వారా తాగునీటిని అందించడం ఎంతవరకు సాధ్యమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, గోవిందు, అనీఫ్‌బాషా, ఈరన్న, దస్తగిరిబాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

నందవరం : గ్రామాల్లో ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో హౌసింగ్ డీఈ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాలలో చేపట్టిన ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీఓ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రమణీయం.. కోసిగయ్య రథోత్సవం



అశేష జనవాహిని మధ్య సాగుతున్న రథోత్సవం

కోసిగి: కోసిగి ప్రజల ఆరాధ్య దైవం కోసిగయ్య (ఆంజనేయ) స్వామి మహా రథోత్సవం సోమవారం సాయంత్రం వేలాది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. వేకువ జాము నుంచి ఆలయంలో స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో జలాభిషేకం , పంచామృతాభిషేకం, ఆకుపూజ, వెండికవచ అలంకరణలు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి వేద పండితులు జయతీర్థ ఆచార్, రఘునందన్ ఆచార్‌ల సారథ్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా తేరుబజారు మైదానం వరకు వచ్చారు. అక్కడ సీతమ్మ కట్టపై కొలువుంచి వేదపండితులు సీతరాముల స్వామి వారి నిశ్చయ తాంబూళం అందజేసి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ బద్ధంగా మాజీ దివంగత ఎమ్మెల్యే సత్యనారాయణ రాజు దొర ఇంటి నుంచి ఆయన వంశస్తులు మురళీ కృష్ణంరాజు దొర, శ్రీనివాస రాజు దొరల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఊరేగింపుగా రథం వద్దకు చేరుకుని పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులు గావించి వేలాది భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామి వారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథా స్థానానికి చేర్చారు. భక్తులు రథంపై అరటి, మామిడి పళ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది కొత్తగా బెంగళూరు నుంచి ప్రత్యేక పూలు తెప్పించి డ్రోన్ ద్వారా రథంపై పూలవర్షం కురిపించారు.



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొనసాగిన సంప్రదాయం

ఇటీవల పెళ్లి చేసుకున్న నూతన వధువరూలు తలంబ్రాలు నాటి వస్త్రాలు ధరించి రథత్సోవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ కొనసాగింది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రోథం వద్ద పూజలు చేసుకున్నారు. సీఐ మంజునాథ్, ఎస్‌ఐ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆంజనేయస్వామి రథోత్సవం

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గొల్ల నరసింహారెడ్డి ఇంటినుంచి కుంభాన్ని రథం దగ్గరికి ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ఆశీనులనుగావించి అశేష భక్త జనుల కరతాళ ధ్వనుల మధ్య రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్ అనసూయమ్మ, గ్రామ పెద్దలు జాము మూకయ్య, నారాయణరెడ్డి, నల్లారెడ్డి, లక్ష్మన్న, మాదవరెడ్డి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు.



భక్తజన సమూహం నడుమ రథోత్సవం

వైభవంగా గాయత్రీదేవి రథోత్సవం

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో సోమవారం గాయత్రీదేవి 48వ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మహాగణపతి సమేత మానసాగాయత్రీదేవికి పంచామృతాభిషేకం, అరుణ హోమం, చండీహోమం, ఆదిశేష సభ హోమం చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అర్చక పురోహిత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గరుడాద్రి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని పురవీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో రవాణా. క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో ఈనెల 6న దళిత యువకులు సునీల్, మహేంద్రలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడానికి కారణమైన ఆర్యవేశ్య సేవ సమితి వారిని అరెస్టు చేయాలని సంఘం జిల్లా నాయకుడు దుర్గప్ప, మండల అధ్యక్షుడు గుడికంబాలి ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ అధ్వ ర్యంలో సేవా సమితి ప్రధాన ద్వారానికి తాళం వేసి మృతుల కుటుంబీకులతో కలిసి ధర్నా చేపట్టారు. సీఐ అశోక్‌కుమార్, అక్కడకు చేరుకుని మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చేస్తామని, సంఘం వారు వచ్చి మృతుల కటుంబ సభ్యులతో మాట్లాడుతారని చెప్పారు. దీంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాజీ అధ్యక్షుడు రాజబాబు, ఉరుకుంద వీరేష్, ప్రకాశ్, డేనియల్, ఆదాం, జయప్ప, ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలింతల ఆసరా సాయానికి మంగళం

నందవరం : కూటమి సర్కార్ ఆరోగ్యశ్రీలో భాగంగా బాలింతలకు ఇచ్చే రూ.5 వేల ఆసరా సాయానికి మంగళం పాడేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని ముగతి గ్రామంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య ఆసరా పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవవించిన ప్రతి బాలింతకు రూ.5,000 తక్షణ సాయంగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. బాలింతలకు తక్షణ ఆర్థిక సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మహిళలకు ఎన్నికల ముందు ఎన్నో సాధ్యంకాని హామీలను ఇచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక వాటిలో ఒక్కటీ అమలు చేయకుండా దగా చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు మల్లికార్జున, భీముడు, ఉసేని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విరూపాక్షిరెడ్డి